ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
5
ఆదివారం 11 ఫిబ్రవరి 2024



కొంచెం చేదు.. కొంచెం తీపి..



బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాలో కొన్నింటికే నిధులు

- కాకతీయ మెగాటెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధికి హామీ
- లెదర్ పార్క్‌ల ఏర్పాటుతో జనగామ జిల్లాకు లబ్ధి
- రూ.2లక్షల రుణమాఫీతో రైతుల్లో ఆనందం
- రైతు బంధు రూ.15వేలకు పెంపుతో ఊరట
- ఐటీ పరిశ్రమలకు ఊతంతో ఐటీ పార్క్‌కు మహర్దశ

హనుమకొండ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు పెద్దగా నిధుల కేటాయింపులు జరగలేదు. ఉమ్మడి జిల్లా ప్రజలు ఆశించిన మేరకు నిధుల వరదలేవీ పారలేదు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం అసెంబ్లీలో 2024-25 సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మిశ్రమ స్పందన లభిస్తోంది. వరంగల్ గీసుగొండలో నిర్మాణంలో ఉన్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఇచ్చిన హామీ కాస్త ఊరటనిచ్చింది. రాష్ట్రంలో రెండు లెదర్ పార్క్‌లను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. ఇందులో ఒకటి జనగామ జిల్లాలో ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఐటీ పరిశ్రమలను ద్వితీయ, తృతీయ నగరాలకు విస్తరించనున్నట్టు పేర్కొన్న దృష్ట్యా ఉమ్మడి వరంగల్ జిల్లాకు కొంత మేలు జరగవచ్చు. రూ.2 లక్షల రుణమాఫీ చేయనున్నట్టు చేసిన ప్రకటనతో అన్నదాతల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రకటించినట్టు రైతు బంధును రూ.15వేలకు పెంచనున్న ప్రకటనతో కూడా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రూ.500కు గ్యాస్, 200 యూనిట్ల ఉచిత కరెంట్‌తో సహా ఆరు గ్యారెంటీల అమలుకు అనుకున్నట్టుగానే బడ్జెట్‌లో భారీగా నిధుల ప్రతిపాదన చేశారు. నీటిపారుదల రంగానికి పెద్దపీట వేసినా కాళేశ్వరం, దేవాదుల, ఎస్ఆర్ఎస్‌పీ ప్రాజెక్టులకు ఆశించిన మేరకు నిధుల ప్రస్తావన లేదు. మొత్తం మీద బడ్జెట్ పట్ల ప్రజల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది.

మెగా టెక్స్‌టైల్

వరంగల్ గీసుగొండలో నిర్మాణంలో ఉన్న కాకతీయ మెగాటెక్స్‌టైల్ పార్క్ మరింతగా అభివృద్ధి చేస్తామని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. రాష్ట్ర నిధులతో పాటు పీఎం మిత్ర నిధులను ఇందు కోసం పూర్తిస్థాయిలో వినియోగిస్తామన్నారు. దీంతో వరంగల్ జిల్లా ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతోంది. రానున్న రోజుల్లో పెద్ద మొత్తంలో నిధులు మంజూరై పార్క్ పనులు త్వరితగతిన పూర్తికాగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎంతో ఆట్టహాసంగా మెగాటెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటుచేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. పార్క్‌లో యూనిట్ల స్థాపనకు అవసరమైన ప్రాతిపదిక సౌకర్యాల కల్పనకు నిధులను ఇవ్వలేదు. గత సంవత్సరం బడ్జెట్‌లో కేటాయించిన రూ.160కోట్లు ఏమూలకు సరిపోలేదు.

రెండు లెదర్ పార్క్‌లు

మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్‌లో లెదర్ పార్క్‌ల ఏర్పాటును ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో త్వరలో రెండు లెదర్ పార్క్‌లను ఏర్పాటు చేయబోతున్నట్టు పేర్కొన్నారు. ఇందులో ఒకటి జనగామ జిల్లాలో ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఈ జిల్లాలో మెగా లెదర్ పార్క్‌ను ఏర్పాటు చేయనున్నట్టు గత ఐటీ పరిశ్రమల మంత్రి కేటీఆర్ 2016లో అసెంబ్లీలో స్వయంగా ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తోలు ఉత్పత్తులకు మంచి అవకాశం ఉంది. ముఖ్యంగా జనగామ జిల్లాలో చర్మకారులు అధిక సంఖ్యలో ఉన్నారు. ఈ దృష్ట్యా ఇక్కడ లెదర్ పార్క్ ఏర్పాటుకు గతంలోనే సన్నాహాలు జరిగాయి. ఇప్పుడు పూర్తిస్థాయిలో సాకారం అయ్యే అవకాశం ఉంది. బడ్జెట్‌లో పరిశ్రమల శాఖకు రూ.2,543 కోట్లను ప్రతిపాదించారు.

వీటి ఊసే లేదు..

తమ ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న సూపర్ స్పెషాలిటీ ఇతర ఆస్పత్రులు, మెడికల్ కాలేజీలు, నర్సింగ్ కాలేజీల నిర్మాణానికి కావలసిన నిధులను మంజూరు చేస్తుందని ఆర్థిక మంత్రి ప్రకటించారు. వరంగల్ పాత సెంట్రల్ జైలు స్థలంలో రూ.11వేల కోట్లతో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనుల సత్వర పూర్తికి బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధుల ప్రస్తావన లేదు. సెంట్రల్ జైలు పునర్నిర్మాణ ప్రతిపాదన కూడా చేయలేదు. మామునూరు విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయనునట్టు సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించినా ఆమేరకు నిధుల కేటాయింపు జరగలేదు. మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో ఉక్కు కర్మాగారం ఊసేలేదు. కాళోజీ కళాక్షేత్రం, ఔటర్ రింగ్ రోడ్డు, కాకతీయ విశ్వవిద్యాలయం తదితర వాటికి నిధుల ప్రతిపాదనలు బడ్జెట్‌లో కానరాలేదు.

ఐటీ పరిశ్రమలు

ఐటీ పరిశ్రమ హైదరాబాద్‌కు పరిమితం కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి నరాలకు విస్తరించేందుకు ప్రణాళికలను రచిస్తున్నట్టు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అత్యంత అధునాతనమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా ఐటీ రంగంలో నైపుణ్యం మరింత వృద్ధి చెందేలా తమ ప్రభుత్వం నూతన విధానాన్ని రూపొందిస్తున్నట్టు మంత్రి భట్టి ప్రకటించారు. దీనివల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో కూడా ఐటీ పరిశ్రమల స్థాపనకు మార్గం సుగమం

మిగతా 8వ పేజీలో

విద్యారంగానికి అరకొర నిధులే..

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 10: కొత్త ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి బాటలు వేస్తుందనే ఆశలు బడ్జెట్ కేటాయింపుతో ఆవిరైనట్లు విద్యారంగ నిపుణులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన కాంగ్రెస్ పార్టీ.. శుక్రవారం ప్రకటించిన బడ్జెట్‌లో 7.75శాతం అంటే కేటాయింపుల్లో సగానికే నిధుల కేటాయింపుతో పరిమితమైంది. రాష్ట్రంలోని 26వేల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్వహణకు ఎలాంటి నిధులు కేటాయించపోవడంపై ఉపాధ్యాయులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అయితే రాష్ట్రంలో రూ.500కోట్లతో కొత్తగా ఇంటర్నేషనల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించడం ప్రభుత్వ విద్యారంగంలో కార్పొరేట్ స్థాయి బోధనకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వం 2023-24 బడ్జెట్‌లో రూ.19,093కోట్లు (బడ్జెట్‌లో 6.5శాతం) కేటాయిస్తే, ప్రస్తుతం బడ్జెట్‌లో రూ.21,389కోట్లు (7.75 శాతం)నిధులను కేటాయించింది. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల అభివృద్ధి కోసం రూ.3వేల కోట్లు కోరగా, అందుకోసం రూ.500కోట్లు మాత్రమే నిధులు కేటాయించడంతో రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల అభివృద్ధి కుంటుపడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మేడిగడ్డకు సీఎం రేవంత్‌రెడ్డి

13వ తేదీన ఎమ్మెల్యేలతో కలిసి బ్యారేజీ పరిశీలన

అసెంబ్లీలో ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాళేశ్వరం అవినీతిపై ఫోకస్

ప్రజల్లోకి బీఆర్ఎస్ అవినీతిని తీసుకెళ్లేలా కాంగ్రెస్ వ్యూహం



వరంగల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 13న మేడిగడ్డ బ్యారేజీ పరిశీలనకు వస్తున్నట్లుగా ప్రకటించారు. ఈ మేరకు సీఎం అసెంబ్లీలో ఎమ్మెల్యేలతో కలిసి మేడిగడ్డ బ్యారేజీ పరిశీలనకు వెళుతున్నట్లు ప్రకటించారు. దీంతో సీఎం, ఎమ్మెల్యేల పర్యటనల నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేసున్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు కూడా మేడిగడ్డ పర్యటనకు వచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. అయితే బీఆర్ఎస్ శాసనసభ పక్ష నేత, మాజీ సీఎం కేసీఆర్‌ను కూడా మేడిగడ్డకు రావాలని సీఎం ఆహ్వానించారు.

బాధ్యులపై సర్కారు కొరడా..

గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, అక్రమాలపై కొత్త ప్రభుత్వం దృష్టి పెట్టింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ 20వ పిల్లర్ కుంగిపోయింది. నాణ్యత లోపంతోనే బ్యారేజీ కుంగిందని, తాము అధికారంలోకి రాగానే కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. స్వయంగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ సైతం గత ఏడాది నవంబరు 2వ తేదీన బ్యారేజీ పరిశీలించారు. డిసెంబరు 7న కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిపెట్టారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలోని లోపాలతో పాటు బాధ్యులను గుర్తించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారుల బృందం నెల రోజులు వివిధ ప్రాంతాల్లో తనిఖీలు, ఫైల్స్ స్వాధీనం, ఇంజనీర్ల విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో భారీ అక్రమాలు జరిగినట్లుగా, నాణ్యత లోపంతో పాటు డిజైన్ లోపం ఉన్నట్లుగా గుర్తించారు. దీంతో సాగునీటి శాఖ ఈఎన్‌సీ (జనరల్) మురళీధర్‌ను రాజీనామా చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. అలాగే రామగుండం ఈఎన్‌సీ, కాళేశ్వరం ఇన్‌చార్జి నల్లా వెంకటేశ్వర్లను పదవిని తొలిగించింది.

బీఆర్ఎస్ అవినీతిని ఎండగట్టేలా..

మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోడంపై అప్పటి కేసీఆర్ ప్రభుత్వంలో బాధ్యులు ఎవరనేదానిపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిపెట్టింది. మేడిగడ్డ బ్యారేజీలోని లోపాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. డిసెంబరు 11వ తేదీన భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో జలసౌధలో నీటిపారుదశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టు రిపోర్టు మొత్తం తమకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఆ తరువాత డిసెంబరు 16వ తేదీన శాసన మండలిలో సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిస్తామని ప్రకటించారు. డిసెంబరు 17వ తేదీన నీటిపారుదల శాఖ అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టుపై సమీక్ష చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపైన, మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడానికి గల కారణాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వానికి పూర్తి నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. డిసెంబరు 18వ తేదీన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాళేశ్వరం చీఫ్ ఇంజనీర్లు మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లు, బి.నాగేంద్రతో పాటు ఎల్‌అండ్‌టీ కంపెనీ వైస్‌ప్రెసిడెంట్ దేశాయ్

మిగతా 8వ పేజీలో...

మంత్రికి విద్యుత్ ఇంజనీర్ల వినతి

గణపురం, ఫిబ్రవరి 10: తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఇంజనీర్లు కోరారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యుత్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్, ప్రధాన కార్యదర్శి నెహ్రూరా మాట్లాడుతూవిద్యుత్ శాఖలో 1999-2004 మధ్య కాలంలో నియామకమైన ఇంజనీర్లకు, ఉద్యోగులకు జీపీఎఫ్ పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో, ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ కంపెనీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సంఘం డైరీని ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బాలరాజు, శ్రీనివాస్, వెంకటనారాయణ, కిరణ్, అక్బర్, సునిల్, మధు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న విద్యుత్ ఇంజనీర్లు

24 నుంచి టీసీసీ పరీక్షలు

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 10: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు డీఈవో రామ్‌కుమార్ శనివారం ఒక ప్రకనటలో తెలిపారు. ఈ పరీక్షలు 27 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. పరీక్షకు హాజరు కాబోయే విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా తమ హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు పరీక్షలు జరుగనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు అరగంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

టైలరింగ్ అభ్యర్థులు తమ వెంట కుట్టుమిషన్ తెచ్చుకోవాలని పేర్కొన్నారు. సెల్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు.

లోక్ అదాలత్‌కు విశేష స్పందన

భూపాలపల్లి జిల్లాలో 113 కేసుల పరిష్కారం



స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న మెజిస్ట్రేట్ రామచంద్రరావు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఫిబ్రవరి 10: భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన స్పెషల్ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. ఫస్ట్ క్లాస్ ప్రిన్సిపల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్, ఫస్ట్ క్లాస్ అడిషనల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టుల్లో రెండు బెంచ్‌లను ఏర్పాటు చేశారు. ఈ-పెట్టీ, డ్రంకెన్‌డ్రైవ్, ఎంవీయాక్టు కేసుల్లో పట్టుబడిన వారి నుంచి జరిమానాలు వసూలు చేశారు. ఈ లోక్ అదాలత్‌లో మొత్తంగా 113 కేసులను పరిష్కరిచారు. ప్రిసైడింగ్ ఆఫీసర్లు ఎస్.రామచంద్రరావు, జి.అఖిల, బెంచ్ మెంబర్లు మంగళంపల్లి రాజ్‌కుమార్, మచ్చ వసంత, వివిధ పోలీస్‌స్టేషన్లకు చెందిన కోర్టు కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

ములుగు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసు



ములుగు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్‌కు సమ్మె నోటీస్ అందజేస్తున్న సిబ్బంది

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 10: ములుగు ఏరియా వైద్యశాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు, సిబ్బంది సూపరింటెండెంట్ జగదీశ్‌కు శనివారం సమ్మె నోటీసు అందజేశారు. ఈనెల 16న దేశవ్యాప్తంగా జరిగే భారత్‌బంద్‌లో తాము పాల్గొంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, వేణునాయక్, కృష్ణ, విజయ్‌చందర్, స్వామి, సదయ్య, రాజయ్య, కుమార్; నాగరాజు, రవికిరణ్, గాదె రమేష్, ఎమ్డీ.ఫజల్, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో భక్తుల సందడి

మహదేవపూర్, ఫిబ్రవరి 10: మండలంలోని కాళేశ్వరంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి ఉదయాన్నే వచ్చిన భక్తులు గోదావరిలో స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. శనివారం కావడంతో భక్తులు నవగ్రహ పూజల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆదివారం వారాంత సెలవు కావడం తోపాటు మరో పది రోజుల్లో మేడారం జాతర ఉండడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది.



గోదావరిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

పలిమెల ఎత్తిపోతల పరిశీలన

సందర్శించిన నీటిపారుదల, ఐడీసీ అధికారులు

మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలతో కదలిక



పలిమెల లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద ఇరిగేషన్, ఐడీసీ అధికారులు

మహదేవపూర్ రూరల్ (పలిమెల) ఫిబ్రవరి 10 : పలిమెల మండల కేంద్ర శివారు గోదావరి ప్రాంతంలో గతంలో నిర్మించి వదిలేసిన ఎత్తిపోతల పథకాన్ని ఇరిగేషన్, ఐడీసీ(ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్) అధికారులు శనివారం పరిశీలించారు. ప్రాజెక్టు పునరుద్ధరణకు సంబంధించి సాధ్యాసాధ్యాలను తెలుసుకునేందుకు వచ్చారు. వారం రోజుల క్రితం పలిమెల పర్యటనకు వచ్చిన ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు అక్కడి రైతులు తమ గోడును వినిపించారు. పలిమెల ఎత్తిపోతలు, సాగునీటి సమస్యల గురించి వివరించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. పలిమెల ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అక్కడే ఉన్న ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలోనే అధికార బృందం శనివారం పరిశీలించింది. త్వరలోనే పలిమెల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణకు సంబంధించి పూర్తి వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ సూచన మేరకు పునరుద్ధరణకు సంబంధించి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ తిరుపతి రావు, డీఈ సురేష్ కుమార్, ఐడీసీ డీఈ మహేష్ చందర్, ఏఈఈ గణేష్, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మోటారు వెయ్యబోయి..

విద్యుదాఘాతంతో రైతు మృతి

తీగ సరిచేస్తుండగా ప్రమాదం

మహాముత్తారం, ఫిబ్రవరి 10: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోర్లగూడెం గ్రామానికి చెందిన గండ్ర కిషన్‌రావు (36) తన పొలానికి నీళ్లు పారించడానికి ఉదయం వెళ్లాడు. బోరు మోటారుకు ఊడిపోయిన తీగలను అమర్చే క్రమంలో విద్యుఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటి నుంచి వెళ్లిన కిషన్‌రావు సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా విగత జీవిగా పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహదేవపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య కీర్తన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.





సంఘటన స్థలం వద్ద కిషన్‌రావు మృతదేహం, కిషన్‌రావు(ఫైల్)

మేడారం జాతరలో నష్టపోయిన వ్యాపారులకు న్యాయం చేస్తాం..

ఎస్పీ హామీ ఇచ్చారు : పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు

మేడారం, ఫిబ్రవరి 10: వనదేవతల గద్దెల ముఖద్వారం వద్ద ఏర్పాటైన దుకాణాలను అధికారులు తొలగించిన ఘటనలో నష్టపోయిన వ్యాపారులకు న్యాయం చేస్తామని ఎస్పీ శబరీశ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు తెలిపారు. ఈ సంఘటన జరిగిన అనంతరం ఎస్పీ తనతో నేరుగా మాట్లాడారని చెప్పారు. గద్దెల ముఖద్వారం వద్ద పలువురు వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేయగా భక్తుల రద్దీ నేపథ్యంలో ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో అదనపు కలెక్టర్ శ్రీజ శుక్రవారం రాత్రి వాటిని ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగింపజేసిన విషయం విదితమే. దీనిపై వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దిసేపు అక్కడ నిరసనకు దిగారు. అధికారులు దుకాణాలను ధ్వంసం చేశారని, దీంతో నష్టపోయామని మండిపడ్డారు.

ఈ క్రమంలో ఎస్పీ శబరీశ్ తనతో నేరుగా మాట్లాడారని జగ్గారావు తెలిపారు. జరిగిన నష్టాన్ని వెంటనే భర్తీ చేస్తామని చెప్పారని పేర్కొన్నారు. వ్యాపారులు ఈ ఘటనను మరిచిపోయి జాతర విజయవంతానికి కృషి చేయాలని ఎస్పీ కోరారని తెలిపారు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ద్వారా నష్ట అంచనాను వేశారని అన్నారు. జాతర సమీపిస్తుంటడంతో భక్తుల సౌకర్యాల దృష్ట్యా షాపులను తొలగించినట్టు స్పష్టం చేశారని జగ్గారావు తెలిపారు. అందరి సహకారంతోనే మహాజాతర విజయవంతమవుతుందని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారని చెప్పారు.

తాటికొండ దారెటు..?

కాంగ్రెస్‌లో చేరేందుకు రాజయ్య తీవ్రంగా ప్రయత్నాలు ● అపాయింట్‌మెంట్ ఇవ్వని కాంగ్రెస్ ఢిల్లీ నేతలు



వరంగల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాజీ డిప్యూటీ సీఎం, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య కాంగ్రెస్‌లో చేరికకు బ్రేకులు పడుతున్నాయి. రాజయ్యను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని ఒకవైపు సొంత నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనలు చేస్తుంటే.. మరోవైపు ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలు సైతం రాజయ్యకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా దాటవేస్తున్నారు. దీంతో రాజయ్య బీఆర్‌ఎస్‌ను వీడే విషయంలో తొందరపడ్డారా? అనే చర్చ జరుగుతోంది.

3న బీఆర్‌ఎస్‌కు రాజీనామా

స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఈనెల 3వ తేదీన బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా ప్రకటించారు. తనకు పార్టీలో గౌరవం లేదని, కొన్నాళ్లుగా పార్టీలో క్షోభ అనుభవించానని ప్రకటించారు. త్వరలోనే ఏ పార్టీలో చేరేది వెల్లడిస్తానని తెలిపారు. అయితే ఈనెల 10వ తేదీన కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు మీడియాకు లీకులు ఇచ్చారు. దీంతో రాజయ్య శనివారం కాంగ్రెస్‌లో చేరుతారని ఆయన అభిమానులు ఎదురుచూస్తు ఉండిపోయారు. అయితే రాజయ్య కాంగ్రెస్‌లోకి రావడాన్ని స్థానిక కాంగ్రెస్ నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఎట్టి పరిస్థితుల్లో రాజయ్యను పార్టీలోకి చేర్చుకోవద్దంటూ పార్టీ శ్రేణులు, ముఖ్యంగా మహిళ కార్యకర్తలు గాంధీభవన్ వద్ద ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేశారు. అయితే ఇవేమీ పట్టించుకోకుండా రాజయ్య శనివారం ఉదయమే ఢిల్లీకి వెళ్లారు. తెలంగాణ ఉద్యమంలో తాను పోషించిన పాత్రతో పాటు స్టేషన్‌ఘన్‌పూర్‌లో తనకు ఉన్న బలం, బలగంతో కూడిన 30పేజీల నివేదికను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గేకు పంపించారు. అయితే అక్కడి నుంచి పార్టీలో చేరేందుకు ఎలాంటి పిలుపు రాకపోవటంతో తెలంగాణ భవన్‌లో రాత్రి వరకు ఎదురుచూసినట్లు సమాచారం. ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కేసీ.వేణుగోపాల్ అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నించినప్పటికీ ఫలితం లేదని సమాచారం. టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా మాత్రమే పార్టీలోకి రావాలని, సీఎంను కాదని తాము పార్టీలో చేర్చుకోలేమని కాంగ్రెస్ పెద్దలు తమ పీఏల ద్వారా తేల్చి చెప్పినట్టుగా ప్రచారం జరుగుతోంది.

కాగా, రాజయ్య చేరికకు ఓ మంత్రి సీఎం రేవంత్‌రెడ్డిని తొలుత ఒప్పించినట్లుగా సమాచారం. అయితే రాజయ్య రాజీనామాతో నియోజకవర్గంలో వ్యక్తమవుతున్న ఆందోళనలతో సీఎం సైతం వెనక్కి తగ్గినట్లుగా తెలిసింది. దీంతో రాజయ్య కాంగ్రెస్‌లో చేరికకు బ్రేకులు పడుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఆదివారం మరోసారి ప్రయత్నాలు చేయాలని రాజయ్య నిర్ణయించుకున్నట్లుగా సమాచారం. పార్టీలో చేర్చుకునేందుకు హామీ ఇచ్చిన మంత్రి సైతం ఫోన్ స్విచ్ఛాఫ్ చేయటంతో రాజకీయంగా రాజయ్య ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. అయితే కాంగ్రెస్ నుంచి సరైన హామీ లేకుండా బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి రాజయ్య తొందరపడ్డారనే టాక్ వినబడుతోంది.

సీఐలు, ఎస్‌ఐల బదిలీలు

9మంది ఇన్‌స్పెక్టర్లు, 10 మంది ఎస్‌ఐలకు స్థానచలనం

ఉత్తర్వులు జారీ చేసిన సీపీ అంబర్ కిషోర్ ఝా

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 10: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 9 మంది ఇన్‌స్పెక్టర్లు, 10 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల తర్వాత తొలి విడతగా మూడు రోజుల కిందట 29 మంది ఇన్‌స్పెక్టర్లు బదిలీ కాగా, తాజాగా మరో 9 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ జరిగింది. అయితే కొందరు ఒకే చోట ఎక్కువ కాలం పని చేయడంతో బదిలీ చేయగా, మరికొందరికి బదిలీ అయిన వారి స్థానాల్లో పోస్టింగ్ ఇచ్చారు. పోస్టింగ్ పొందిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాలు జారీ చేశారు.

సీఐల విభాగంలో..

పేరు	ప్రస్తుతం	బదిలీ ప్రదేశం
ఎస్.వాసుదేవరావు	కమిషనరేట్	సుబేదారి
ఎం.ఏ షుకూర్	సుబేదారి	సీసీఆర్‌బీ
బి.రాజగోపాల్	కమిషనరేట్	పర్వతగిరి
సీహెచ్.శ్రీధర్	కమిషనరేట్	కేయూసీ
పి.రంజిత్‌రావు	కమిషనరేట్	శాయంపేట
డి.మల్లేశ్	శాయంపేట	మల్టీజోన్ ఐజీ అటాచ్
జి.మహేందర్‌రెడ్డి	వీఆర్	పాలకుర్తి
పి.దయాకర్	కమిషనరేట్	టాస్క్‌ఫోర్స్
ఎ.రాంబాబు	టాస్క్‌ఫోర్స్	మల్టీజోన్ ఐజీ అటాచ్

ఎస్‌ఐల విభాగంలో..

పేరు	ప్రస్తుతం	బదిలీ ప్రదేశం
ఎస్.చెన్నకేశవులు	హనుమకొండ	దేవరుప్పుల
కె.శ్రవన్‌కుమార్	దేవరుప్పుల	వీఆర్
ఎం.సాయిప్రసన్నకుమార్	ఇంతేజార్‌గంజ్	పాలకుర్తి
టి.శ్రీకాంత్	పాలకుర్తి	వీఆర్
వి.సందీప్	హనుమకొండ	రాయపర్తి
డి.విజయ్‌కుమార్	రాయపర్తి	వీఆర్
అయ్యల శ్వేత	గీసుగొండ	తరిగొప్పుల
డి.నరేష్	తరిగొప్పుల	వీఆర్
బి.హరికృష్ణ	స్టేషన్ ఘన్‌పూర్	పీటీసీ వరంగల్
బి.రవీందర్	పరకాల	వీఆర్

అన్నీ మంచి శకునములే..

నేటి నుంచి శుభముహూర్తాలు

సుబేదారి, ఫిబ్రవరి 10: పెళ్లి మంగళవాయిద్యాలకు మంచిరోజులొచ్చాయి. నెల రోజుల విరామం తర్వాత శుభముహూర్తాలు వచ్చాయి. పుష్యమాసం (శూన్యమాసం) కావడంతో శుభ కార్యక్రమాలు ఇన్ని రోజులు జరగలేదు. శనివారం నుంచి మాఘమాసం ప్రారంభమైంది. దీంతో నేటి (ఆదివారం) నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు అన్ని మంచి రోజులు కావడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేల సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. ఈ నెల 14వ తేదీన వసంత పంచమి ఉండటంతో పెద్ద సంఖ్యలో శుభ కార్యాలకు ముహూర్తాలు ఉన్నాయి.

ఏప్రిల్ 9న ఉగాది తర్వాత ఏప్రిల్ 10 నుంచి 24 వరకు మాత్రమే మంచి రోజులు ఉన్నాయి. ఏప్రిల్ 30 నుంచి జూలై 10వ తేదీ వరకు గురు మూఢమి, శుక్రమూఢమి ఉన్నందున ఈ సారి మే, జూన్ మాసాల్లో మంచి రోజులు లేవని పురోహితులు అంటున్నారు. ఫిబ్రవరి నెలలో 13, 14, 17, 18, 24, 28, 29, మార్చి నెలలో 2, 3, 15, 17, 20, 22, 24, 25, 27, 28, 30, ఏప్రిల్ నెలలో 3, 4, 9, 18, 19, 20, 21, 22, 24 తేదీలలో మంచి రోజులు ఉన్నాయి.

మేడారం జాతరకు బస్ టికెట్ చార్జీల ఖరారు

సుబేదారి, ఫిబ్రవరి 10: వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు సమ్మక్క, సారలమ్మల జాతర జోరుగా సాగనుంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు మేడారం వెళ్లడానికి బస్సుల చార్జీలను ఖరారు చేశారు. హనుమకొండ బస్‌స్టేషన్, కాజీపేట, వరంగల్, పరకాల, చిట్యాల నుంచి మేడారంకు పెద్దలకు రూ.250కాగా, పిల్లలకు (5ఏళ్ల నుంచి 12 ఏళ్లలోపు) రూ.140చార్జీ చేయనున్నారు. అలాగే జనగామ నుంచి పెద్దలకు రూ.370, పిల్లలకు రూ.210, హైదరాబాద్ నుంచి పెద్దలకు రూ.550, పిల్లలకు రూ.310, హైదరాబాద్ శివారు ప్రాంతాల నుంచి పెద్దలకు రూ.600, పిల్లలకు రూ.320, స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి పెద్దలకు రూ.300, పిల్లలకు రూ.180, నర్సంపేట నుంచి పెద్దలకు రూ.250, పిల్లలకు రూ.150, కొత్తగూడ నుంచి పెద్దలకు రూ.300, పిల్లలకు రూ.170 ఖరారు చేశారు.

మహబూబాబాద్ నుంచి పెద్దలకు రూ.350, పిల్లలకు రూ.190, గూడూరు నుంచి పెద్దలకు రూ.280, పిల్లలకు రూ.160, తొర్రూర్ నుంచి పెద్దలకు రూ.350, పిల్లలకు రూ.190. వర్ధన్నపేట నుంచి పెద్దలకు రూ.300, పిల్లలకు రూ.160 ఖరారు చేశారు. ఆత్మకూరు నుంచి పెద్దలకు రూ.210, పిల్లలకు రూ.120, మల్లంపల్లి నుంచి పెద్దలకు రూ.180, పిల్లలకు రూ. 110, ములుగు నుంచి పెద్దలకు రూ.150, పిల్లలకు రూ.90, భూపాలపల్లి నుంచి పెద్దలకు రూ.220, పిల్లలకు రూ.130, ములుగు గణపురం నుంచి పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.110, జంగాలపల్లి నుంచి పెద్దలకు రూ.150, పిల్లలకు రూ.90, పస్రా నుంచి పెద్దలకు రూ.80, పిల్లలకు రూ.50, గోవిందరావుపేట నుంచి పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.60, తాడ్వాయి నుంచి పెద్దలకు రూ.60, పిల్లలకు రూ.40గా టికెట్ చార్జీలు కేటాయించారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసానికి రెడీ?

కాటారం, ఫిబ్రవరి 10: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి చెందిన పలువురు డైరెక్టర్లు పీఏసీఎస్ ఛైర్మన్ చల్ల నారాయణరెడ్డిపై అవిశ్వాసం పెట్టడానికి యత్నిస్తున్నట్టు సమాచారం. కాంగ్రెస్‌కు చెందిన డైరెక్టర్లతో కలిసి పలువురు బీఆర్ఎస్ డైరెక్టర్లు అవిశ్వాసం దిశగా సమాలోచన చేస్తునట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును పీఏసీఎస్ వైస్ ఛైర్మన్‌తో పాటు పలువురు డైరెక్టర్లు శనివారం కలిసినట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికలకు ముందే బీఆర్ఎస్‌కు చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ చీమల సత్యం కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన డైరెక్టర్లు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, రాజునాయక్, తోటపల్లి ప్రశాంత్‌తో పాటు బీఆర్ఎస్ నుంచి వచ్చే వారితో కలిసి తొమ్మిది మంది డైరెక్టర్లు అయ్యారు. మరో బీఆర్ఎస్ డైరెక్టర్ సైతం వీరికి సహకరిస్తానని చెప్పినట్టు తెలుస్తోంది. దీంతో సహకార శాఖ అధికారులకు అవిశ్వాసంపై దరఖాస్తు చేయనున్నారని సమాచారం. పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. కొద్ది రోజులకే బీఎస్పీలో చేరి మంథని నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం, స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు కీలక మంత్రి పదవిలో ఉండటంతో ప్రతిపక్ష ప్రజా ప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్‌కు టచ్‌లోకి రావడంతో మండలంలో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. పార్లమెంట్ ఎన్నికల నాటికి కాంగ్రెస్‌లో చేరికలు ఊపందుకుంటాయని పలువురు కాంగ్రెస్ నేతలు వెల్లడించారు.

బ్యారేజీ వద్ద హడావిడి

'మేడిగడ్డ'ను పరిశీలించిన
ఆర్అండ్‌బీ ఇన్‌చార్జి ఈఎన్సీ మోహన్ నాయక్

మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 10: కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీని రోడ్లు భవనాల శాఖ ఇన్‌చార్జి ఈఎన్సీ మోహన్ నాయక్ శనివారం పరిశీలించారు. కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఈనెల 13న పర్యటించనున్న నేపథ్యంలో బ్యారేజీ కుంగిన ప్రాంతం, వెలుపల గోదావరిలో పగుళ్ల తేలిన పిల్లర్ల ప్రాంతం వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. బ్యారేజీ వంతెనపై తీసుకోవాల్సిన భద్రత చర్యలపై స్థానిక పోలీస్ అధికారులతో చర్చించారు. మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్నట్టు ప్రకటన వెలువడటంతో ముందస్తుగా పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. మహదేవపూర్ నుంచి సూరారం వరకు ఉన్న ఆర్ఆర్‌బీ రోడ్లను పరిశీలించారు. సూరారం శివారు ప్రాంతం నుంచి ఎల్అండ్‌టీ రోడ్డుకు కలిపే లింకు రోడ్డు మరమ్మతులపై స్థానిక అధికారులకు ఇన్‌చార్జి ఈఎన్సీ పలు సూచనలు చేశారు. రోడ్ల వెంట సూచిక బోర్డులు. సెంట్రల్ లైనింగ్, రోడ్డుకు సమీపంలో ఉన్న చెట్లకు కలరింగ్ తదితర అంశాలతో పాటు ఇబ్బందికరంగా ఉన్న చోట చేపట్టాల్సిన


మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ప్రాంతంలో వంతెనపై అధికారులు

పనుల గురించి వివరించారు. వారి వెంట స్థానిక ఆర్ అండ్‌బీ అధికారులతోపాటు మహదేవపూర్, కాటారం సీఐలు, ఎస్సైలు ఉన్నారు.

కాటారం-మంథని రహదారిలో..

కాటారం : మండలంలోని కాటారం-మంథని రహదారితో పాటు పలు రహదారులను ఆర్అండ్‌బీ ఇన్‌చార్జి ఈఎన్‌సీ, సీఈ(స్టేట్ రూరల్ రోడ్స్) మోహన్‌నాయక్ పరిశీలించారు. ఈనెల 13న మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు బస్సుల్లో ఎమ్మెల్యేలను తీసుకెళ్లనున్నట్లు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో ఆర్అండ్‌బీ అధికారులు అలర్ట్ అయ్యారు. వరంగల్, కరీంనగర్ వైపు నుంచి మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డకు వెళ్లే రహదారులపై ఎలాంటి గుంతలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. రహదారులను పరిశీలించి మరమ్మతులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈఎన్‌సీ వెంట ఎస్ఈ నాగేందర్‌రావు, ఈఈ వెంకటేశ్, డీఈఈ రమేష్, ఏఈ అవినాష్ ఉన్నారు.

మేడిగడ్డకు సీఎం రేవంత్‌రెడ్డి

(5 వపేజీ తరువాయి)

తదితరులతో మేడిగడ్డపై సమీక్ష నిర్వహించారు. కుంగిన మేడిగడ్డ బ్యారేజీని ఎల్అండ్‌టీ కంపెనీ పునరుద్ధరించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒత్తిడి తెచ్చారు. ఆ తరువాత డిసెంబరు 29వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల బృందం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి కుంగిన ప్రాంతాన్ని పరిశీలించింది. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టులో భాగస్వామ్యమైన ఈఎన్‌సీలు మురళీధర్, నల్ల వెంకటేశ్వర్లుతో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇప్పించారు. మీడియాతో పాటు మంత్రుల బృందం పర్యటనతో ప్రజల్లో మేడిగడ్డ బ్యారేజీ కుంగటంపై ఆసక్తి కలిగింది.

అయితే తాజాగా స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డ పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 13వ తేదీన ఎమ్మెల్యేలతో కలిసి మేడిగడ్డ బ్యారేజీని పరిశీలిస్తామని, అసెంబ్లీ నుంచే ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. కాగా, మొత్తానికి మేడిగడ్డ బ్యారేజీలో జరిగిన అవినీతి ప్రజల్లోకి పూర్తిస్థాయిలో తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సీఎం, ఎమ్మెల్యేల పర్యటన నేపథ్యంలో మేడిగడ్డ వద్ద భారీ భద్రత ఏర్పాట్లకు డీజీపీ నుంచి పోలీసులకు ఆదేశాలు అందాయి.

మేడారం భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

అధికారులతో ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

మేడారం, ఫిబ్రవరి 10: సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి మేడారం తరలివచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మేడారంలో ఆమె శనివారం పర్యటించారు. భక్తుల సౌకర్యాలను పరిశీలించిన కలెక్టర్ గద్దెలకు సమీ పంలో ఉన్న గిరిజన సమగ్రాభివృద్ధి సంస్థ అతిథిగృ హంలో పలు శాఖ అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్‌గా వనదేవతలకు, భక్తులకు సేవ చేయాలనే కోరిక గత సంవత్సరంలో నుంచి ఉండేదని అన్నారు. అమ్మవార్ల ఆశీస్సులతో ఆ అవకాశం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. మహాజాతర విజయవంతానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. మరుగుదొడ్లు, తాగునీరు భక్తుల సౌకర్యాలు ప్రధామన్నారు. అధికారులకు జాతర నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉంటే ఆయా శాఖల ఎస్ఈల ద్వారా తన దృష్టికి తీసుకురావాన్నారు. ఈసారి జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా


చిలకల గుట్ట వద్ద పరిసరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు ఆయా శాఖలు సమన్వయంగా పనిచేయాలన్నారు. యువతను, పూజా రులను సమన్వయం చేసుకోవాలన్నారు.

చిలకలగుట్ట పరిసరాల పరిశీలన

చిలకలగుట్ట పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, మేడారం దేవస్థానం ఈవో రాజేంద్రంతో కలిసి గుట్టకు చేరుకున్నారు. అక్కడ చేపట్టనున్న పనులు, సౌకర్యాలు, వసతులను పరిశీలించారు. గుట్టకు చుట్టూ ప్రాకారంపై నిర్మించిన గిరిజన సంప్రదాయ కళా చిత్రాలను పరిశీలించారు. ముఖద్వారం వద్ద చేపట్టే అభివృద్ధి పనులను పరిశీలించారు. అదేవిధంగా గుట్టపైకి కొంత దూరం చెప్పులు లేకుండా నడిచి వెళ్లారు. సమ్మక్క దేవతను ఈనె 22న కుంకుమ భరణి రూపంలో గద్దెలకు తీసుకురావడానికి దారిని ఏర్పాటు చేయడం కోసం పొదల తొలగింపును పరిశీలించారు. గుట్ట కింద ప్రాంతంలో దేవతను తీసుకొచ్చే క్రమంలో ఎదురయ్యే సమస్యలను జగ్గారావును అడిగి తెలుసుకున్నారు. చర్ప వంశీయుల ఆడబిడ్డలు సమ్మక్క దేవత గుట్ట దిగిన తర్వాత మొదటి హారతి ఇస్తారని, ఆ సమయంలో భక్తుల రద్దీతో ఇబ్బందులు ఎదురవుతాయని ఆయన వివరించారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం వనదేవత గద్దెల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న క్యూలైన్ల పనులను కలెక్టర్ పరిశీలించారు. తాగునీటి ఏర్పాటు, భక్తుల దర్శనాలు, వీఐపీ, వీవీఐపీల భద్రత, వసతి, ప్రొటోకాల్ దర్శనాలు, సౌకర్యాలు, సీఎం రాక ఏర్పాట్లు తదితర పనులను పరిశీలించారు.

కొనసాగుతున్న ముందస్తు మొక్కులు

మేడారంలో 50 వేలకు పైగా తరలి వచ్చిన భక్తులు


వనదేవతల గద్దెల వద్ద భక్తులు

మేడారం, ఫిబ్రవరి 10: మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు శనివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి మహా జాతరకు ముందుగా మొక్కులు చెల్లించుకున్నారు. ఎత్తుబంగారం(బెల్లం), పూలు, పండ్లు, చీరె, సారె, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమలు సమర్పించారు. ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. శివ సత్తుల పూనకాలతో, డోలు వాయిద్యాల నడుమ తల్లుల గద్దెలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. 50 వేలకు పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని ఈవో రాజేంద్రం తెలిపారు.

24 గంటల దర్శనాలు

మేడారానికి ముందస్తుగా తరలి వస్తున్న భక్తులకు నిరంతరంగా దర్శించుకొనే అవకాశం కల్పించారు. 24 గంటలు వనదేవతల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకునేలా దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే.. పగలు భక్తుల రద్దీ


వనదేవతలను దర్శించుకోవడానికి వస్తున్న భక్తులు

అధికంగా ఉంటున్నప్పుడు నేరుగా భక్తులు గద్దెలకు చేరకుండా తాళాలు వేస్తున్నారు. దీంతో బయట నుంచే భక్తులు దర్శనాలు చేసుకుంటున్నారు. రాత్రిళ్లు భక్తులు తాకిడి తక్కువగా ఉంటుండడంతో నేరుగా తల్లుల గద్దెలను దర్శించుకోవడానికి అనుమతినిస్తున్నారు.

మారుమూల ప్రాంతాలకు
రెడ్ క్రాస్ సేవలు : డీఎంహెచ్‌వో



పెనుగోలు ఆదివాసీలకు కిచెన్‌సెట్స్‌ను అందిస్తున్న రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ అప్పయ్య

వాజేడు, ఫిబ్రవరి 10: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు మారుమూల ప్రాంతాలకు అందుతున్నాయని డటం ప్రశంసనీయమని ఆ సంస్థ చైర్మన్, డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అన్నారు. మండలంలోని పెనుగోలు గుట్టలపై జీవనం సాగిస్తున్న ఆదివాసీలకు, పెనుగోలు కాలనీలో నివాసం ఉండే గిరిజనులకు ములుగు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కిచెన్‌సెట్స్ రగ్గులు, దోమ తెరలు, హైజీన్ కిట్స్‌ను శనివారం పంపిణీ చేశారు. మొత్తం 52 కుటుంబాలకు అందజేశారు. గుట్టలపై ఎలాంటి సౌకర్యాలు లేని ఆదివాసీలకు వారి ఇంటి అవసరాలకు అన్ని విధాలు ఉపయోగపడే వస్తువులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంసీ మెంబరు పసుపులేటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

వైద్యాధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలను అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యం తీరును పరిశీలించారు. ఆస్పత్రిలో అత్యవసర మందుల నిల్వలపై ఆరా తీశారు. ఆయన వెంట వైద్యాధికారులు కొమురం మహేందర్, అల్లి మధుకర్, జ్ఞానస, హెచ్ఎస్ కోటిరెడ్డి, సిబ్బంది స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పునరావాస స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో


పునరావాస కాలనీని పరిశీలిస్తున్న ఆర్డీవో

మల్హర్, ఫిబ్రవరి 10 : జెన్‌కో ఓసీపీలో భూములు కోల్పోయిన కాపురం, తాడిచర్ల ఎస్సీకాలనీ వాసులకు కేటాయించిన స్థలాన్ని ఆర్డీవో రమాదేవి శనివారం సందర్శించారు. తాడిచర్ల గ్రామంలో కేటాయించిన పునరావాస కాలనీలోని రోడ్లను, డ్రెయినేజీలతో పాటు వసతులను పరిశీలించారు. కాపురం గ్రామస్థులను తరలించే ప్రక్రియలో భాగంగా పునరావాస కాలనీలో పనులు పూర్తయినది లేనిది పరిశీలించారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ సరిత తదితరులు ఉన్నారు.

డబ్బాలను తొలగించాలి : సీపీఐ

కాకతీయఖని, ఫిబ్రవరి 10: భూపాలపల్లి పట్టణంలోని బస్టాండ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో అక్రమంగా ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్ శనివారం ఒక ప్రకటనలో మునిసిపల్ అధికారులను డిమాండ్ చేశారు. రాజకీయ నాయకులు, ఆర్థికంగా ఉన్న వారు సైతం అక్కడ డబ్బాలను ఏర్పాటు చేసుకున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. రోడ్డు వెడల్పులో భాగంగా ఎందరో చిరు వ్యాపారులు తమ జీవనోపాధిని కోల్పోయారని, వారిని గుర్తించి వారికి అక్కడ డబ్బాలను ఏర్పాటు చేసుకునేలా వెలుసుబాటు కలిగించాలని కోరారు. లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నిరుద్యోగులకు జాబ్ మేళా

కాకతీయఖని, ఫిబ్రవరి 10: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఈనెల 12న జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్యామల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం పట్టణంలోని ప్రగతి భవన్‌లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పేరు పొందిన ప్రైవేటు సంస్థల్లో పనిచేసేందుకు 300 మంది నిరుద్యోగులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. 18 సంవత్సరాల వయస్సు పైబడిని నిరుద్యోగ యువతీ యువకులు విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులను, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ ప్రతులను, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో 12వ తేదీన ఉదయం 10.30 గంటలకు ప్రగతి భవన్‌లో హాజరు కావాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే సెల్ నెంబర్ 7702457968పై సంప్రదించాలని పేర్కొన్నారు.

డిప్యూటేషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 10: ఎస్‌సీఈఆర్‌టీలో డిప్యూటేషన్‌పై పనిచేసేందుకు జిల్లాలోని అర్హులైన ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు ఈనెల 17లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్‌హై శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్యూటేషన్ రెండేళ్ల కాలపరిమితి ఉంటుందని, పోస్టు గ్రాడ్యుయేషన్, ఎంఈడీ పూర్తిచేసి 58ఏళ్లలోపు వారై ఉండాలన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కాటారం, ఫిబ్రవరి 10: మండలంలో ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతిలో ప్రవేశం పొందడానికి ఆదివారం నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గంగారంలోని మోడల్ పాఠశాల, మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర, బాలికల గురుకుల విద్యాలయాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో 902 మంది విద్యార్థులు ప్రవేశపరీక్షకు హాజరవనున్నట్లు ఆయా విద్యాలయాల ప్రిన్సిపాల్స్, సీఎస్‌లు మధు, బుచ్చయ్య, శైలజ తెలిపారు. విద్యార్థులు కేంద్రాలకు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

ఆర్ఎంపీ, పీఎంపీల కార్యవర్గం ఎన్నిక

టేకుమట్ల, ఫిబ్రవరి 10: ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం నూతన మండల కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుంకరపల్లి భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా పెంట రజింత్ కుమార్, ఉపాధ్యాక్షుడిగా జక్కె రాజేందర్, సహాయ కార్యదర్శిగా ఎం.డి.మగ్బూల్, ముఖ్య సలహాదారుడిగా సిరికొండ నరేంద్రాచారి, కోశాధికారిగా సోమ రమేష్, గౌరవ అధ్యక్షుడిగా గొల్లపల్లి రాజయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులను సభ్యులు సన్మానం చేశారు. మండల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్, జిల్లా ఉపాధ్యాక్షులు చింతల కుమార్ యాదవ్, దొడ్ల అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా దుబాసి బాలరాజ్, అధికారి ప్రతినిధి చేవూరి రాజేందర్, ఆడెపు సంపత్, కోతుల రవీందర్, మ్యాదరీ నరేష్, బోనాల సతీష్, గొల్లపల్లి సంతోష్‌లు తదితరులు పాల్గొన్నారు.

రామప్ప ఆలయంలో సందడి


రామప్ప ఆలయంలో పర్యాటకులు, భక్తులు

వెంకటాపూర్(రామప్ప), ఫిబ్రవరి 10: మండలంలోని రామప్ప దేవాలయంలో శనివారం పర్యాటకులు, భక్తుల సందడి నెలకొంది. మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతర సమీపిస్తున్న నేపథ్యంలో దూర ప్రాంతాల్లోని భక్తులు, పర్యాటకులు ముందస్తుగా వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈక్రమంలో మండలంలోని పాలంపేటకు చేరుకొని రామప్ప ఆలయాన్ని సందర్శించారు. రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గర్భగుడికి తూర్పుముఖద్వారాన ఉన్న నందీశ్వరుడిని దర్శించుకుని చుట్టూ ప్రదక్షిణలు చేసి దేవాలయ శిల్పకళా సంపదనువీక్షించి ఆలయ చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సరస్సు వద్దకు చేరుకుని బోటులో షికారు చేస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ఆనందంగా గడిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి కౌన్సెలింగ్

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఫిబ్రవరి 10: వివిధ మండలాల్లో డ్రంకెన్‌డ్రైవ్ కేసుల్లో పట్టుబడ్డ వారికి పోలీసులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ నరేష్‌కుమార్ భూపాలపల్లిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా ప్రమాదాల గురించి వివరించారు. ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను వివరిస్తూ తమపై ఆధారపడి ఉన్న కుటుంబీకులకు జరిగే నష్టాలను కులంకుశంగా వివరించారు. అనంతరం మద్యం సేవించి వాహనం నడపబోమనిప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రవీందర్, ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి దగ్ధం

కాటారం, ఫిబ్రవరి 10: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి దగ్ధమైన సంఘటన మండలంలోని ధన్వాడ జీపీ పరిధిలోని కిష్టంపేటలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పొనగంటి సమ్మయ్య తన ఇంట్లో పత్తిని నిల్వ చేశాడు. ఆ గదిలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడటంతో నిప్పు రవ్వలు పత్తిపై పడి మంటలు లేచాయి. సమ్మయ్య కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి మోటార్లతో నీటిని చల్లారు. సుమారు 10క్వింటాళ్ల పత్తి నష్టం వాటిల్లిందని సమ్మయ్య ఆవేదన చెందాడు.

నేడు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 10: మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతిరావుపూలే బాలుర గురుకుల పాఠశాలలో ఐదోతరగతి ప్రవేశం కోసం ఆదివార పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే పరీక్షకు 240మంది విద్యార్థినీవిద్యార్థులు హాజరుకానున్నారని అన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా గుర్తింపుకార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. కనీసం గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, సెంటర్ వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

రెజ్లింగ్ క్రీడాకారులకు బహుమతులు

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 10: తెలంగాణ అమేచ్యూర్ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొన్న భూపాలపల్లి క్రీడాకారులు పలు బహుమతులు సాధించినట్లు రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కౌటం రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న హనుమకొండలోని జవహర్‌లాల్ స్టేడియంలో ఈ క్రీడలు జరుగగా భూపాలపల్లికి చెందిన కృతిక 58 కిలోల రెజ్లింగ్ విభాగంలో ద్వితీయ బహుమతి సాధించిందని పేర్కొన్నారు, 39 కేజీల విభాగంలో నిహారికకు తృతీయ, 62 కేజీల విభాగంలో అన్వితకు తృతీయ బహుమతి, బాలురలో 85 కేజీల విభాగంలో పార్థసారథికి ద్వితీయ బహుమతి సాధించినట్టు వివరిఅంచారు. వారిని శనివారం అసోసియేషన్ సభ్యులు రాజేందర్, శ్రీధర్, కరీం, అశోక్ అభినందించారు.

బీజేపీ మండల అధ్యక్షుడి రాజీనామా

మగపేట, ఫిబ్రవరి 10: బీజేపీ మండల అధ్యక్షుడు లోడే శ్రీనివాస్‌గౌడ్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఏడాదిన్నర కాలంగా మండల అధ్యక్షుడిగా తాను బాధ్యతలు నిర్వర్తించానని, వ్యక్తిగత కారణాల వల్ల అధ్యక్ష పదవికి రాజీనామా చేసి సామాన్య కార్యకర్తగా కొనసాగుతానని పేర్కొన్నారు. తన రాజీనామా పత్రాన్ని పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరామ్‌కు పంపినట్టు తెలిపారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు

గోవిందరావుపేట, ఫిబ్రవరి 10: మండలంలోని కర్లపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 8,9,10 తరగతుల విద్యార్థులకు వైద్య సిబ్బంది శనివారం ఎనిమియా ముక్తిభారత్ కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న విద్యార్థులకు మందులు అందజేశారు. అదే విధంగా చర్మవ్యాధులు, గుండె, చెవి సమస్యలు, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల వివరాలు సేకరించి తదుపరి చికిత్సకు ఏర్పాట్లు చేస్తామని సిబ్బంది పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కల్తి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గణపురం పీఏసీఎస్ ఛైర్మన్‌గా కుమార్


నియామక పత్రం అందుకుంటున్న కుమార్

గణపురం, ఫిబ్రవరి 10: గణపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్‌గా కన్నెబోయిన కుమార్ ఎన్నికయ్యారు. చైర్మన్‌గా కొనసాగిన పోరెడ్డి పూర్ణచందర్‌రెడ్డిపై ఈనెల 5న ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో డీసీవో శైలజ ఆధ్వర్యంలో శనివారం పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ పదవికి ఎన్నిక నిర్వహించారు. అప్పయ్యపల్లి డైరెక్టర్‌గా ఉన్న కన్నెబోయిన కుమార్ ఛైర్మన్ పదవికి నామినేషన్ వేశారు. మొత్తం 13 డైరెక్టర్లు ఉండగా మాజీ ఛైర్మన్, మరో ఇద్దరు హాజరుకా కపోవడంతో మిగతా పది మంది కుమార్‌కే మద్దతు తెలిపారు. దీంతో కుమార్ పీఏసీఎస్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. డీసీవో శైలజ కుమార్‌కు నియామక పత్రం అందజేశారు.

ఎంపీవో, జీపీ సెక్రటరీపై చర్యలు తీసుకోవాలి

తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ

ఏటూరునాగారం, ఫిబ్రవరి 10: తాడ్వాయి ఎంపీవో, మేడారం గ్రామ పంచాయతీ సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ ములుగు జిల్లా అధ్యక్షుడు పులిసే బాలకృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. మేడారం మహాజాతరలో తైబజారుకు సంబంధించిన టెండర్ విధానాన్ని పాటించకుండా అధికారులే మేడారంలో వ్యాపారుల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. జాతరలో స్థానిక 20 నుంచి 30 మంది యువతకు ఉపాధి కల్పించాలని గ్రామపంచాయతీలో తీర్మానం చేయగా అది పక్కదారి పట్టిందన్నారు. తాడ్వాయి ఎంపీవో, మేడారం జీపీ సెక్రటరీ టెండర్ విధానానికి అడ్డుపడుతున్నారన్నారు.

కొంచెం చేదు.. కొంచెం తీపి..

(5వ పేజీ తరువాయి)

అవుతుంది. రాంపూర్‌లో ఉన్న ఐటీ పార్క్‌లో యూనిట్ల స్థాపనకు మరిన్ని ఐటీ కెంపెనీలు ముందుకు వచ్చే అవకాశం ఉంది. గత ప్రభుత్వం తగిన చొరవ తీసుకోకపోవడం వల్ల ఈ ఐటీ పార్క్‌లో నాలుగు కంపెనీలు మాత్రమే తమ ఐటీ యూనిట్లను ఏర్పాటు చేసాయి.

పంచాయతీలకు నిధులు

పంచాయతీరాజ్ శాఖకు బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. ఆరు గ్యారంటీల తర్వాత ఎక్కువ మొత్తంలో ఈశాఖకే నిధులు కేటాయించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి బడ్జెట్‌లో రూ.40,080 కోట్లను ప్రతిపాదించారు. ఉమ్మడి జిల్లాలో 1,680 గ్రామపంచాయతీలు ఉన్నాయి. గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల పంచాయతీలు నిధులు లేక నీరసించాయి. పల్లెల అభివృద్ధికి పలు కార్యక్రమాలను చేపట్టినా అమేరకు నిధులు ఇవ్వకపోవడంతో అధికారులు, ముఖ్యంగా సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సు ప్రకారం పంచాయతీలకు నిధులు విడుదల చేస్తామని ప్రకటించారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాకు గత ప్రభుత్వ హయాంలోకన్నా ఎక్కువ నిధులు అందే అవకాశం ఉంది.

నగరాభివృద్ధి

రాష్ట్రంలోని అన్ని పురప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు పూర్తిస్థాయి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి భట్టి వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు పట్టణ ప్రాంత అభివృద్ధికి నిధులను విడుదల చేస్తామని ప్రకటించారు. బడ్జెట్‌లో పురపాలక శాఖకు రూ.11,692 కోట్లు కేటాయించారు. గత ప్రభుత్వ బడ్జెట్‌లో కన్నా రూ.400కోట్లు ఎక్కువ. బడ్జెట్‌లో వరంగల్ నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఔటర్‌రింగ్ రోడ్డు పనుల పూర్తికి ప్రత్యేకంగా నిధుల కేటాయింపు ప్రతిపాదనలేమీ కనిపించలేదు.

రూ.2లక్షల రుణమాఫీ

రూ.2లక్షల రుణ మాఫీపై త్వరలోనే కార్యాచరణ ఉంటుందని, అందుకు విధివిధానాలను రూపొందిస్తున్నామని ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇది అమలులోకి వస్తే ఉమ్మడి జిల్లాలో లక్షా 50వేల మంది రైతులకు లబ్ధి చేకూరుతుంది. గత ప్రభుత్వం రూ.లక్ష వరకే రుణమాఫీ చేసింది. ఇది కూడా పూర్తిస్థాయిలో అమలు కాలేదు. రూ.2లక్షల వరుకు రుణాల ప్రకటనతో రైతుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది.

రైతుబంధు

రైతు బంధు నిబంధనలను పునఃసమీక్షించి నిజమైన అర్హులకు రైతు భరోసా కింద ఎకరానికి రూ.15వేలు అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్న ప్రకటనతో కూడా అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో 7..40 లక్షల మంది రైతులు లబ్ధి పొందుతారు. గత ప్రభుత్వం రైతు బంధు పథకం కింద రెండు విడతలుగా ఎకరానికి రూ.10వేలు అందచేసింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే రైతు బంధు కింద ఎకరానికి రూ.15వేలు ఇస్తామని వాగ్దానం చేసింది తెలిసిందే. అన్నట్టే బడ్జెట్‌లో ఈ మేరకు ప్రతిపాదన చేసింది. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ. 19,746 కోట్లను ప్రతిపాదించింది.

ఈ-కేవైసీ పూర్తి చేయాలి

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 10: ఈనెల 29లోగా రేషన్‌కార్డు లబ్ధిదారులందరూ ఈ-కేవైసీని పూర్తి చేయాలని పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి నర్సింగరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దగ్గరిలోని రేషన్‌షాపులో లబ్ధిదారులు ఈ-కేవైసీని అప్డేట్ చేసుకోవాలని సూచించారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

చిట్యాల, ఫిబ్రవరి 10: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. విద్యార్థులకు మండల స్థాయి ప్రతిభ పాటవ పోటీలను నిర్వహించి ఎంఈవో కోడెపాక రఘుపతి బహుమతులు ప్రదానం చేశారు. పాటల విభాగంలో టి.స్వరూప, కవితలలో ఓ.చిరంజీవి, ఉపన్యాసం పోటీల్లో పి.విష్ణువర్ధన్, చిత్రలేఖనంలో ఏ.వైష్ణవి విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్ఎన్ మండల కోఆర్డినేటర్‌కృష్ణ, ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీరాం రఘుపతి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, కల్పన, రహీంపాషా, రాజమౌళి, లక్ష్మి. స్వాతి, సిరి, శంకర్ పాల్గొన్నారు.